# మినీకథలు

## అనుమానం

ఉమారాజ్

"డాక్టర్ ప్రభాకర్ వున్నారా?" లోపలికి వచ్చి అడిగిన యువకుణ్ణి చూసిన సిస్టర్. "ఆయన కాజువాలిటీలో వున్నారు. వస్తారు కూర్చోండి" అన్నది. అక్కడ ఆ మందుల వాసనలు పీల్చే బదులు, చెట్ల నీడన కూర్చుందామని ఆ ప్రభుత్వాసుపత్రి ఆవరణలో తిరుగుతూ, మెటర్నిటీ వార్డు దగ్గరికి వచ్చాడు ప్రకాష్. అది సరిగ్గా చిల్డ్రెన్ వార్డు కెదురుగా వుంది. పిల్లల అరుపులకు జడుసుకుంటూ, దూరంగా ప్రశాంతమైన చోట కూర్చుందామని వెళ్ళే అతని కాళ్ళు సడన్ బ్రేక్ వేసినట్లు ఆగిపోయాయి. మెటర్నిటీ వార్డులో కిటికీ దగ్గర బెడ్‌లో కూర్చున్నదెవరు? పద్మ కదూ! పద్మ ఏమిటిలా నీరసించి కనిపిస్తోంది? అదీ ఈ వార్డులో. కొంపదీసి ... కాలేదు కదా! పరిపరి విధాల ఆలోచనలు అతని మనసు తొలుస్తూంటె, అక్కడ కూర్చోడానికి మనస్కరించక లేచి ఇంటికి వచ్చేశాడు.

"అమ్మా! యిక్కడికి రా. నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"అబ్బా! ఉండరా! పోపుమాడిపోతోంది".

"నీ పోపు మండిపోనూ! అవతల కొంపలంటుకుపోతున్నాయి. రమ్మంటేనూ!"

"అబ్బబ్బా! నీకెప్పుడూ హడావిడే" విసుక్కుంటూ కొడుకు దగ్గరికి వచ్చి, "ఏమిటి చెప్పు?" అన్నది.

"ఆ రంగనాధంగారమ్మాయి పద్మలేదూ. అదే మొన్న తాంబూలాలు పుచ్చుకోడానికి వస్తామని చెప్పివెళ్ళారే వాళ్ళు. ఆవిడను హాస్పిటల్‌లో చూశాను. అదీ ఎక్కడో తెల్సా! మెటర్నిటీ వార్డులో."

"నిజంగా! నీవు బాగా చూశావా? ఆ అమ్మాయేనా?"

"ఆహా! ముమ్మూర్తులా ఆవిడే. పక్కన ఆవిడగారి అక్కయ్యకూడా వుంది. ఇక్కడికి వచ్చి పెద్ద మధ్యవర్తిలా మాట్లాడిందే ఆ లక్ష్మీదేవి."

"ఒరేయ్ అసలా వార్డులో ఆ అమ్మాయి



ఎందుకుందంటావు?"

"నా శ్రాద్ధానికి. మెటర్నిటీ వార్డులో అమ్మాయిలెందుకుంటారమ్మా. కాన్పు లేదా అబార్షన్ కాకపోతే."

"అవ్వా! అవ్వా! ఎవరైనా వింటే యింకేమైనా వుందా! అందుకేనా మనంతొందరగా ముహూర్తం పెట్టించమంటే. వాళ్ళ శాస్త్రిలతో మంచిముహూర్తాలులేవు పైమాసంలో అయితే బ్రహ్మాండమైన తేదీలున్నాయని చెప్పి పంపారు—అసలు కారణం ఇదన్నమాట. అందుకే నేను మొదట్నుంచీమొత్తుకుంటూ వున్నాను. ఆ చదువుకున్న పిల్ల మనకు వద్దురా బాబూ! అణగిమణగివుండదు అంటే విన్నావా? గ్రాడ్యుయేట్ కావాలని పట్టుబట్టావు. ఆ పిల్ల బియ్యే వెలగబెట్టింది ఇందుకే కాబోలు."

"సరే. మనకెందుకింక ఆ అమ్మాయి విషయం. ఆ శాస్త్రిలు ఈసారివస్తే గట్టిగా బుద్ధిచెప్పి పంపు. ఇకమీదట ఇలాంటి సంబంధాలు పట్టుకురావద్దు. మాకా సంబంధం అక్కరలేదని. లేకుంటే మా ఆఫీసుకు పంపు. నేనే నాలుగు మాటలతో దులిపి వదులుతాను" కోపంగా అని లేచి వెళ్ళిపోయాడు ప్రకాష్.

ఇంతకీ వాళ్ళు అపోహపడ్డట్టు పద్మకు అబార్షన్ కాలేదు ఆమెకు టాన్సిలిటీస్‌వుండటంతో. ఆస్పత్రిలో ఇ.ఎన్.టి స్పెషలిస్టుకు చూపించాలని వెళ్తే, ఆయన మైనర్ ఆపరేషన్ చేయాలని ఇంకెక్కడా బెడ్ ఖాళీ లేదని మెటర్నిటీ వార్డులో చేర్పించారు. ఆ హాస్పటల్‌లో డాక్టర్లందరూ పద్మ తండ్రికి తెలిసినవాళ్ళే కావడంతో "ఇలా సర్దుకోండి" అని ఆయనే చెప్పారు. పాపం ఆ రోజు ఉదయమే ఆ వార్డులో చేరిన పద్మ ఆపరేషన్ కాస్తా అవగానే లేచి యింటికి వచ్చేసింది. ఆలోపు ఇంత రాద్ధాంతం జరుగుతుందని ఆమె కలగన్నదా?

(నీతి: పెళ్ళికాని ఆడపిల్లలు ఆపరేషన్ కని ప్రభుత్వాసుపత్రికి వెళ్ళకండి. వెళ్ళినా మెటర్నిటీ వార్డులో మాత్రం అడ్మిట్ కావద్దు.)

---


రికెన్ టెస్ట్ రాసిన వాళ్ళంతా వెళ్ళిపోయేరు సుబ్బారావు తప్ప. సుబ్బారావు మేనేజరు గదిలోకి వెళ్ళేడు.

"నమస్కారం సార్! ఈ రోజు ఉదయం టెస్ట్ రాయడానికి వచ్చిన వాళ్ళలో నేనే మొదటివాణ్ణి. మీ బ్యాంకు మెట్లెక్కుతూంటే ఈ వంద రూపాయల నోటు కనిపించింది. పాపం దీన్ని ఎవరో నిర్భాగ్యుడు పోగొట్టుకున్నాడు. దయచేసి దీన్ని ఆ పోగొట్టుకున్నవ్యక్తికి అందజేసి ఆ విషయం తరువాత నా ఈ అడ్రసుకి తెలియ చేస్తే సంతోషిస్తాను." అంటూ వంద రూపాయల నోటు మేనేజరుకి అందించి వెళ్ళిపోయేడు సుబ్బారావు.

మేనేజరు ఆశ్చర్యపోతూ, అడ్రసు వున్న కాగితాన్ని, నోటుని డ్రాయరులో భద్రపరిచేరు.

మేనేజరు కూర్చున్న అద్దాల గది ఆఫీసు ముఖద్వారానికి ఎదురుగా వుంది. లంచ్ టైములో గుమాస్తా లంతా కాంటీనుకి వెళ్ళేరు. మేనేజరు గదిలో కూర్చొని. పేపరు చూస్తూంటే ఎదురుగా మెట్ల దగ్గర ఒక వ్యక్తి ఏదో పోగొట్టుకున్నట్టు వెతుకుతున్నాడు ఆత్రుతగా. బంట్రోతు పిలుపుతో ఆ వ్యక్తి మేనేజరు గదిలోకి వెళ్ళేడు.

"ఈ రోజు ఉదయం మీ బ్యాంకులో ఎనిమిది వందలు విత్‌డ్రా చేశాను సార్. కాని ఇంటికి వెళ్ళి చూసుకుంటే ఏడు వందలే ఉంది. ఇక్కడే బహుశా వందరూపాయల నోటు పడిపోయి ఉంటుంది. ఏ అదృష్టవంతుడికో దొరికి ఉంటుంది. దురదృష్టవంతుడ్ని ఏం చేస్తాను" అంటూ విచారంగా మొహంపెట్టి వెనుదిరగబోయాడా వ్యక్తి.




"ఆగండి మీరు చాలా అదృష్టవంతులు. ఒక నిజాయితీపరుడికి మీ నోటు దొరికింది. కనుకనే మీకు దక్కింది" అంటూ నోటును అతనికి అందించేరు మేనేజరు చిరునవ్వుతో.

"చాలా థాంక్స్ సార్! వంద రూపాయలు నిష్కారణంగా పోగొట్టుకున్నానని చాలా బాధపడ్డాను. మీ దయవల్ల దొరికింది. నోటు ఇచ్చిన ఆయన ఎవరో కాని దేముడు సార్. అతను మళ్ళీ మీ వద్దకు వస్తే నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలపండి" అంటూ మరీ మరీ థాంక్స్ చెప్పి వెళ్ళిపోయేడు ఆ వ్యక్తి.

రెండు రోజుల తరువాత బ్యాంకు అపాయింట్ మెంటు ఆర్డరు అందుకున్న సుబ్బారావు మేనేజరు ఎదుట నమస్కరించి నిల్చున్నాడు.

"నీ నిజాయితీయే నీకు ఉద్యోగం తెప్పించిందోయ్. ఆ రోజు నీకు దొరికిన వంద రూపాయల నోటు దాని స్వంతదారుని వద్దకే చేరింది. నీలాంటి నిజాయితీపరులకే మా ఆఫీసులో స్థానం" అంటూ సుబ్బారావుని తెగ మెచ్చుకున్నారు మేనేజరు.

కాని సుబ్బారావు అపాయింట్ మెంటు ఆర్డరు అందుకున్న సాయంత్రమే హోటల్ మేనకలో మందు, చికెన్, బిర్యానీల రూపంలో ఆ నోటు సుబ్బారావు, నోటు పోగొట్టుకున్నట్లు నటించిన ప్రఖ్యాత స్టేజి నటుడు సుబ్బారావు మేనమామల కడుపుల్లో దాక్కున్నట్లు పాపం మేనేజరు గారికి తెలియదు!

---

# తెల్లబోయిన లౌక్యం

## శివలెంక లక్ష్మీదేవి




"రండి. రండి. ఇంతమంది పెద్దలు నా ఇంటిని పావనం చేశారు" అంటూ పెద్దలందరినీ ఆహ్వానించాడు చెన్నకేశవులు. వచ్చినవాళ్ళంతా కూర్చున్నాక మునసబుగారు మొదలుపెట్టారు. "కేశవయ్యగారూ, మీ బావమరదిగారి రెండో అమ్మాయి మాలతిని మీ అబ్బాయి కివ్వాలని వారి సంకల్పం-మీరు అంగీకరిస్తే...."

"ఇంతమంది వస్తే కాదంటానా. కాని పెద్దమ్మాయి సుమతికి కాకుండా చేస్తారా?" సందేహంగా అడిగాడు చెన్నకేశవయ్య.

"సుమతికూ-డా కుదరబోతోంది బావగారూ. రేపోస్తారు పెళ్ళివారుమాట్లాడుకోటానికి. రెండు పెళ్ళిళ్ళు ఒకే ముహూర్తానికి చెయ్యాలని నా కోరిక" సంతోషంగా అన్నాడు వెంకట్రామయ్య.

"పెళ్ళికొడుకు ఏం చేస్తున్నాడు?"

"ఇంజనీరు".

"అలాగా!. సంతోషం".

"మరి మిగతా విషయాలు మాట్లాడితే శలవు తీసుకుంటాం" మునసబుగారు లౌక్యంగా కట్నం సంగతి ఎత్తారు.

చెన్నకేశవులు నవ్వాడు.

"మా బావగార్ని ఇంతివ్వమని నేనడుగుతానా? పెద్దల్లుడికి ఎలా ఇస్తారో అలాగే ఇవ్వండి".

చెన్నకేశవులు తెలివికి అంతా ఆశ్చర్యపోయారు. పెద్దల్లుడు ఇంజనీరు, రెండో అల్లుడు వ్యవసాయం. ఐనా ఆ తేడా గురించి ఎవరూ ఎత్తలేదు. అందరూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

మర్నాడు పిలుపు వచ్చింది చెన్నకేశవులుకి పెళ్ళివారు వచ్చారని, మాట్లాడుకోటానికి రమ్మని. కట్నం సంగతి అడిగారు ఇంజనీరు తండ్రిని.

చెన్నకేశవులు ఇంజనీరు తండ్రి వంక ఆశగా, కుతూహలంగా చూస్తున్నాడు-ఆయన నోటి వెంట రాబోయే లకారాలు ఎన్నోనని.

ఇంజనీరు తండ్రి చేతులెత్తి నమస్కారం చేస్తూ, "బాబూ! నా కొడుకుని అమ్మను. ఎందుకంటే మళ్ళీ ఇలాంటి కొడుకుని కనలేను కాబట్టి. వేలం వెయ్యలేను-ఎందుకంటె మా తలకి కొరివి పెట్టాల్సింది వాడే కాబట్టి. మా క్కావలసింది కోడలుమాత్రమే. మావాడికి బేరం పెట్టి బానిసని చెయ్యటానికి కాదు దయచేసి కట్నం పేరెత్తకండి- ముహూర్తాలు చూడండి" అన్నాడు.

అంతే- చెన్నకేశవులుకి నోట మాట రాలేదు! ఎందుకంటే ఇంజనీరంటే ఏ రెండు లక్షలో అడుగుతాడని ఊహించి తన కొడుకు విలువ యాభైకి మించదని గ్రహించి ఆ అల్లుడికి ఇచ్చినట్లే ఇవ్వమని లౌక్యం వెలగబెట్టాడు కదా- అందుకు!